క్లుప్తంగా

రాజేంద్రనగర్ డిపో నూతన సహాయ మేనేజర్‌గా శ్రీపతి కృష్ణ



రాజేంద్రనగర్: రాజేంద్ర నగర్ ఆర్టీసీ డిపో నూతన సహాయ మేనేజర్‌గా శ్రీపతి కృష్ణ బదిలీపై వచ్చారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వెంకన్న బదిలీపై దిల్ సుఖ్‌నగర్ డీపోకు బదిలీపై వెళ్లారు. నూతన సహాయ మేనేజర్‌గా శుక్రవారం ఆయన పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు డిపో కార్మికులు స్వాగతం పలికారు.

పూలే ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్‌గా రామకృష్ణ



రాజేంద్రనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహాత్మ జ్యోతిబాపూలే 197వ జయంతి ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్‌గా రాజేంద్రనగర్‌కు చెందిన వేముల రామకృష్ణను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ట్యాంక్‌బండ్‌పై మహాత్మ జ్యోతిబా పూలే దంపతుల 150 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పాలని కోరారు. తనను ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం కేసీఆర్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సినీ హౌసింగ్ సొసైటీ మాజీ అధ్యక్షుడి మృతి



కొమర వెంకటేష్ (ఫైల్)

మణికొండ: సినీ పరిశ్రమ హౌసింగ్ సొసైటీ, సినీ కార్మికుల ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు కొమర వెంకటేష్ (50) అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురై ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా శుక్రవారం సాయంత్రం ఆరోగ్యం విషమించి మృతి చెందినట్లు అతని స్నేహితులు ప్రకటించారు. మణికొండలో చిత్రపురి హౌసింగ్ సొసైటీ నిర్మాణానికి గతంలో పాలక కమిటీ అధ్యక్షుడిగా, సినీ రంగానికి చెందిన 24 క్రాఫ్ట్స్ అధ్యక్షుడిగా వెంకటేష్ పనిచేశారు. ఆయన మృతి పట్ల తోటి కార్మికులు సంతాపం ప్రకటించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 12 మందికి జైలు

రాజేంద్రనగర్: ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన 41 మందిని కోర్టులో హాజరుపరచగా.. 12 మందికి న్యాయమూర్తి జైలుశిక్షను విధించారని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని దీనిలో భాగంగా ఇటీవల పట్టుబడిన వారిని శుక్రవారం ఉప్పర్‌పల్లిలోని మూడో ప్రత్యేక కోర్టులో హాజరుపరిచామన్నారు. అధిక మొత్తంలో మద్యం సేవించిన వారికి జైలుశిక్ష, మిగిలిన వారికి జరిమానా విధించినట్లు సమాచారం.

మోదీ బహిరంగసభకు తరలనున్న పార్టీ శ్రేణులు

రాయదుర్గం: ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున శేరిలింగంపల్లి నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లనున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు మియాపూర్ న్యూకాలనీలోని శివాలయం నుంచి సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌కు ర్యాలీగా బయల్దేరతామన్నారు.

నల్లగండ్లలో కార్పొరేటర్ పర్యటన

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్లలో కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను ఆయన దృష్టికి తీసుకురాగా, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, తిరుపతి, గిరి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత కలిగిన వారికి పూర్తి సహకారం



మాట్లాడుతున్న జయేష్‌రంజన్

రాయదుర్గం: సృజనాత్మకత కలిగిన వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో సినీప్రెన్యూర్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ సెరిమనీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఏరంగంలోనైనా సాధారణ అభివృద్ధి కన్నా సృజనాత్మకతతో చేసిన పని అందరినీ ఆకట్టుకుంటుందన్నారు. టీహబ్ సీఈఓ ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పార్కులో ఆకట్టుకునేలా ఏర్పాటు చేసిన కోతి,నెమలి, కోడిపుంజు బొమ్మలు



స్తంభంపై ఏర్పాటు చేసిన పావురాల గూడు



వాకింగ్ ట్రాక్

పచ్చదనం.. ఆహ్లాదం

కేరాఫ్ గుల్‌మొహర్‌కాలనీ పార్కు



పార్కులో ప్రజల సందడి

శేరిలింగంపల్లి: ఆకట్టుకునే పచ్చదనం..ఆహ్లాదం, ప్రశాంత వాతావరణం.. పక్షుల కిలకిలరావాలు.. చారిత్రక రాతి సంపద, మహనీయుల శిల్పాలు, ఆకట్టుకుంటున్న పక్షుల బొమ్మలు కనపడతాయి ఆ పార్కులో అడుగుపెట్టగానే. పచ్చదనంతో అలరారుతోంది గుల్‌మోహర్‌కాలనీ పార్కు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని కాలనీ పార్కులలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో మానసికోల్లాసం, ఆహ్లాదపూరిత వాతావరణంలో సేదతీరేలా ఉండడం ఈ పార్కుకే సొంతం. పచ్చదనం, మట్టిపైన వాకింగ్ చేస్తూ కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మహనీయుల శిల్పాలను సైతం ఇక్కడ ఏర్పాటు చేశారు.

- గచ్చిబౌలి డివిజన్‌లోని గుల్‌మొహర్‌కాలనీలో 3.75 ఎకరాల స్థలాన్ని పార్కుకు కేటాయించారు. పచ్చదనం ఈ పార్కు ప్రత్యేకత.
- పార్కును 3 ఎకరాల్లో అభివృద్ధి చేయగా మిగిలిన ప్రాంతంలోని రాళ్లు, పొదలను సహజత్వం కోసం వాటిని అలాగే వదిలేశారు.
- పార్కులో వాకర్స్ కోసం 800 మీటర్ల ప్రత్యేక వాకింగ్‌ట్రాక్‌ను ఏర్పాటు చేశారు.
- అంతటా పచ్చనిచెట్లు, రకరకాల పూలమొక్కలు, పచ్చటి గడ్డితో ఈ పార్కు అలరాలుతోంది.
- పార్కులో పావురాలు, బాతులు, పక్షుల కిలకిలరావాలు పల్లెటూరి వాతావరణాన్ని గుర్తుచేస్తోంది.
- రూ.3.50 లక్షల వ్యయంతో ఆవుదూడ, జిరాఫీ, జింకల ఫైబర్ విగ్రహాలు పార్కులో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.
- కాలనీ ప్రజలు నిత్యం వాకింగ్, వ్యాయామం చేస్తూ, ఆహ్లాదపూరిత వాతావరణంలో సేద తీరుతున్నారు.
- ఇటీవలే జీహెచ్‌ఎంసీ అధికారులు వాకింగ్‌ట్రాక్‌కు మరమ్మతులు చేయడంతో పాటు పార్కు ప్రహరీ ఎత్తు పెంచి, ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు.
- మరిన్ని సౌకర్యాలు కల్పించి, ప్రస్తుత వాతావరణాన్ని కొనసాగిస్తే బాగుంటుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.



పార్కులో ఆకర్షణీయంగా ఉన్న ఆవుదూడ, హంస విగ్రహాలు

గౌలిదొడ్డిలో మౌలిక వసతులు కల్పించాలి

ఎమ్మెల్యేకు బీఆర్‌ఎస్ నాయకుల వినతి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇచ్చిన గౌలిదొడ్డి బీఆర్‌ఎస్ నాయకులు

రాయదుర్గం: గౌలిదొడ్డిలో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి స్థానిక బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఆయనను కలిసి తమ ప్రాంత సమస్యలను వివరించారు. గౌలిదొడ్డిలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా, ప్రధాన రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని వారు కోరారు. ఇందుకు ఎమ్మెల్యే గాంధీ జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి పనులన్నీ దశలవారిగా చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గచ్చిబౌలి డివిజన్ మాజీ వార్డు కమిటీ సభ్యుడు రాగం జంగయ్యయాదవ్, దారుగుపల్లి పరమేష్ తదితరులు కలిశారు.

నేడు 'ఐటా' ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

గోల్కొండ: ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు ఇఫ్తార్ విందు నిర్వహిస్తున్నామని ఐటా షేక్‌పేట్ మండల అధ్యక్షులు మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. నేడు సాయంత్రం 6 గంటలకు టోలిచౌకి డీలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ఉంటుందని ఐటాకు చెందిన హిందూ సోదరులే కాకుండా ట్రాఫిక్, జలమండలి తదితర శాఖల అధికారులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఖాజాగూడలో సామాజిక న్యాయ వారోత్సవాలు



ఖాజాగూడలో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు

రాయదుర్గం: బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో సామాజిక న్యాయ వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం బీజేవైఎం గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు నక్క శివకుమార్ ఆధ్వర్యంలో ఖాజాగూడ ప్రధానరోడ్డులో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యతిరేక శక్తులపై పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు.అనంతరం మధురానగర్‌లో బీజేపీ నాయకులు పెద్దగోని సతీష్‌గౌడ్ నివాసంలో సహపంక్తి భోజన కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యదర్శి మూల అనిల్‌గౌడ్, బీజేపీ నాయకులు కృష్ణముదిరాజ్, నరేందర్ ముదిరాజ్, అమర్‌యాదవ్, ఆర్‌వెంకటేష్, అశోక్, దయాకర్, తిరుపతి పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ



జియాగూడ: నగరంలోని పలుచోట్ల వేసవి కాలం దృశ్యం అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి ఆకుల రవీందర్‌రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని ఉస్మానియా, జర్షిఖానా, నీలోఫర్, ఫీవర్ ఆస్పత్రి, సికింద్రాబాద్ క్లాక్‌టవర్ ప్రాంతాల్లో నిరుపేదలకు అల్పాహార పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి తాడిశెట్టి నవీన్ ఆనంద్, లయన్ ప్రసన్న, లయన్ వీంద్రన్, శ్రవణ్ పాల్గొన్నారు.

కార్వాన్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కార్వాన్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్ డివిజన్ అల్ హస్నాత్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో కొత్త తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నానల్‌నగర్ డివిజన్‌లో అల్ హస్నాత్ కాలనీకి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కాలనీ సంక్షేమ సంఘం వారిని ఎప్పుడూ ప్రోత్సహిస్తూ వచ్చానన్నారు. కాలనీవాసులు సైతం కాలనీలో పచ్చదనం పెంపొందించడంతో పాటు హరితహారం కార్యక్రమాన్ని విజయంతంగా ఎన్నో మార్లు నిర్వహించడం జరిగిందన్నారు. గతంలో ఈ కాలనీ పార్కు బల్దియా వారిచే అత్యుత్తమ పార్కుగా అవార్డు పొందిందన్నారు. ఈ కాలనీ మరిన్ని అవార్డులు పొందేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం కాలనీవాసులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షకార్యదర్శులు షేక్ అబ్దుల్లా, హిరాఫత్ అలీ బాక్రీ తదితరులున్నారు.

'ఓబీసీ కుల గణనపై మోదీ తన వైఖరిని స్పష్టం చేయాలి'

చార్మినార్: పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించే బహిరంగ సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఓబీసీ కుల గణనపై తన వైఖరిని స్పష్టం చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ప్రధాని తన ప్రసంగంలో ఓబీసీ సమస్యలపై స్పందించకుంటే వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓబీసీలు తగిన బుద్ధి చెబుతారన్నారు. దేశ జనాభాలో 56 శాతం ఉన్న ఓబీసీలకు అసెంబ్లీ, పార్లమెంటులో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసి వెంటనే పార్లమెంటులో ఆమోదించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంలోనే నామినేటెడ్ పదవుల్లో ఓబీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు.

కనుల పండువగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో మాట్లాడుతున్న ఆలే జితేంద్ర

గౌలిపురా: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మం కోసం పోరాడాలని మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర అన్నారు. ఆలే జితేంద్ర ఆధ్వర్యంలో గురువారం రాత్రి భారీ శోభాయాత్రను నిర్వహించారు. గౌలిపురా మార్కెట్‌లోని హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర మొఘల్‌పురా, సుల్తాన్‌షాహీ, గౌలిపురా గాంధీ బొమ్మ, శ్రీరాంనగర్ కాలనీ, అయోధ్యనగర్, హనుమాన్‌నగర్‌లోని మంగళముఖి హనుమాన్ ఆలయం, ఛత్రినాక, లాల్‌దర్వాజా, లాల్‌దర్వాజా మోడ్, శాలిబండ చౌరస్తా, హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న దేవాలయం, బేలా చౌరస్తా, గౌలిపురా మార్కెట్‌లోని దేవాలయానికి చేరుకుంది. ఈ శోభాయాత్రలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షులు రాకేశ్‌తివారీతో పాటు కె.ప్రేమ్ కిశోర్, జి.ఎం.జ్యోతి కుమార్,, సాకెల్లి సర్వేశ్, కె.రాజ్ కుమార్, సాయి, డాక్టర్ విజయ్ పాల్గొన్నారు. హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య ఆధ్వర్యంలో మొఘల్‌పురా, ఛత్రినాక, శాలిబండ, హుస్సేనీఆలం పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే



శంషాబాద్ వెలాంగనీ కాలనీ చర్చిలో శిలువధారణ



కిస్మత్‌పూర్‌లో..

శంషాబాద్: పట్టణంలోని వెలాంగనీ కాలనీలోని చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలను దైవ ప్రార్థనలతో నిర్వహించారు. 'పారిశుద్ధ్య దేవమార్గం' అనే దృశ్య రూపాన్ని ప్రదర్శించారు. క్రీస్తు శిలువధారణ తదితర అంశాలపై జరిగిన దృశ్య రూపం అందరినీ ఆకట్టుకుంది. ఏసుప్రభువుగా తుమ్మ సంపత్‌రెడ్డి నటించారు.

బండ్లగూడ: బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కిస్మత్‌పూర్‌లోని మెథడిస్ట్ చర్చిలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సువర్ణ ప్రభుదాస్ క్రీస్తు జీవితచరిత్రపై ప్రసంగం చేశారు.



మెథడిస్ట్ చర్చిలో ప్రసంగిస్తున్న సువర్ణ ప్రభుదాస్

ప్రధాని బహిరంగ సభను విజయవంతం చేయాలి

శంషాబాద్: నగరంలో పరేడ్ మైదానంలో ప్రధాని నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని పట్టణ 12వ వార్డు కౌన్సిలర్, బీజేపీ సీనియర్ నాయకులు కె. ప్రవీణ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బీజేపీ నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని సభకు బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు. దశాబ్దాల కల అయిన శంషాబాద్ ఎంఎంటీఎస్ సర్వీసుల ప్రారంభానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. గత ప్రభుత్వాలు ఎంఎంటీఎస్ సర్వీసుల విషయంలో విఫలమయ్యాయని మండిపడ్డారు. బీజేపీ ఎస్సీ ప్రొటోకాల్ ఇన్‌చార్జ్ కొప్పుల ప్రశాంత్, కిసాన్ మోర్చా కార్యదర్శి రవి, భాస్కర్‌ముదిరాజ్, అరుణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బీజేవైఎం నేతల సహపంక్తి భోజనం



రాజేంద్రనగర్: భారతీయ జనతా యువమోర్చా జాతీయ పార్టీ పిలుపు మేరకు దళిత నాయకుడి ఇంట్లో సహపంక్తి భోజనం కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ డివిజన్ కేంద్రంలో నిర్వహించారు. జిల్లా యువ మోర్చా కార్యవర్గ సభ్యుడు జనపాల శత్రుఘ్న ఇంట్లో శుక్రవారం నిర్వహించగా.. యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీధర్, రాష్ట్ర యువమోర్చా మాజీ కార్యదర్శి బాల్‌రెడ్డి, బీజేవైఎం రాజేంద్రనగర్ కన్వీనర్ వినయ్‌రెడ్డి, అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాటేదాన్ పారిశ్రామికవాడలో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాజేంద్రనగర్: కాటేదాన్ పారిశ్రామికవాడలోని ఓ ప్లాస్టిక్ బాటిల్స్ సంస్థలో గురువారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. రాత్రి ఒంటి గంట సమయంలో ప్లాస్టిక్ ముడిసరుకు, బాటిళ్ల నిల్వ ఉంచిన చోట ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. నిమిషాల వ్యవధిలోనే గోదాం మొత్తం మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో గోదాంలో ఎవరు లేకపోవటంతో భారీ ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు తెలిపారు. ఇలాంటి పరిశ్రమలకు అనుమతులు ఇవ్వవద్దని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైకుంఠధామాన్ని సందర్శించిన సీడీఎంఏ



మణికొండలో వైకుంఠధామాన్ని పరిశీలించిన సీడీఎంఏ సత్యనారాయణ



స్వచ్ఛ ఆటో నడుపుతూ ఆదర్శంగా నిలిచిన సుశీలకు చీర అందజేత

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలో ఆధునిక హంగులతో ఏర్పాటు చేస్తున్న వైకుంఠధామాన్ని కమిషనర్, డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) డాక్టర్ సత్యనారాయణ సందర్శించారు. శుక్రవారం వైకుంఠధామంలో ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను ఆయన మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఆయన మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛ ఆటో నడుపుతూ.. మహిళలకు ఆదర్శంగా నిలిచిన మహిళా డ్రైవర్ సుశీలను అభినందించి చీరను బహూకరించారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు ఆర్థికంగా రాణించాలంటే తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని ఉపాధి మార్గంగా మలచుకోవాలని సూచించారు. డీఈ దివ్యజ్యోతి, కౌన్సిలర్ కె.లక్ష్మీనారాయణ, కో-ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు యాలాల నరేష్, రవికాంత్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచవటి కాలనీలో రెడ్డి సమ్మేళనం



మణికొండ: రెడ్డి కులంలో ఉన్న పేదలను అన్ని విధాలుగా ఆదుకోవటంతో పాటు వారి పిల్లల చదువులకు వైద్యం, ఉద్యోగాల పరంగా సహాయం చేయాల్సిన అవసరం ఉందని రెడ్డి సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మణికొండ మున్సిపాలిటీ పంచవటి కాలనీ కమ్యూనిటీహాల్‌లో రెడ్డి సంఘం సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఓటరు లిస్టుల ఆధారంగా 20 వేలకు పైగా రెడ్డీలు ఉన్నా.. ఎలాంటి ఐక్యత లేకుండా ఉన్నారన్నారు. వారంత ఒకచోట చేరితే రెడ్డీలతో పాటు సమాజానికి ఎన్నో మంచి కార్యక్రమాలు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా అందరినీ ఏకంచేసే ఉద్దేశంతో కాలనీల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో జరిగే సమావేశాలకు రెడ్డీలు పెద్ద ఎత్తున తరలి రావాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కె.నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, భీంరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230